

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 23 డిసెంబరు 2024









పూబాటలో హాయ్‌హాయ్..

దారంతా పూల వనమల్లే ఉంటే ప్రయాణం ఎంతో ఉల్లాసంగా సాగుతుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే దారిలో రోటరీ వద్ద పచ్చని పచ్చిక, రంగురంగుల పూల అందాలు వాహనదారులను మైమరిపిస్తున్నాయి. రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌పై ఎత్తైన చెట్ల నీడ హాయి గొల్పుతుంటే వాహనదారులు రయ్ రయ్ మంటూ దూసుకుపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ , రంగారెడ్డి జిల్లా

రైల్వేబ్రిడ్జి రోడ్డు.. రయ్‌రయ్!

కొత్తూర్ రైల్వే వంతెన వద్ద అదనంగా పది ఫీట్ల మేర రోడ్డు వెడల్పు
త్వరలో పనులు పూర్తి
తొలగనున్న ఇక్కట్లు

8



గుంతల రోడ్డుకు మోక్షం

సాఫీగా ప్రయాణం
రూ.2 కోట్లతో 1.2 కి.మీ. బీటీ రోడ్డు
వాహనదారులు, ప్రయాణికుల హర్షం

6



లక్ష్యం కోసం.. నిర్లక్ష్యం!



జిల్లేడు రోడ్డులో ఎండిపోయిన మొక్క



చౌదరిగూడలో రోడ్డు పక్కన చెట్ల ఎదుట మళ్లీ నాటిన మొక్కలు

'వనమహోత్సవం'.. అపహాస్యం

- చెట్ల ఎదుట మళ్లీ మొక్కలు
- ఇష్టానుసారంగా నాటిన వైనం
- ప్రశ్నార్థకంగా మొక్కల సంరక్షణ
- పట్టించుకోని అధికారులు

హరితహారం వివరాలు

సంవత్సరం	నాటిన మొక్కలు (లక్షల్లో)
2015-16	73.75
2016-17	139.24
2017-18	71.04
2018-19	86.12
2019-20	105.42
2020-21	102.74
2021-22	89.24
2022-23	81.41
2023-24	85.41
2023-24	85.06
2024-25	80.02

రంగారెడ్డి అర్బన్/చౌదరిగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం, భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని అందించేందుకు గత ప్రభుత్వం 2015 సంవత్సరంలో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా దీనిని విజయవంతంగా చేపట్టింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'హరితహారం'ను 'వనమహోత్సం'గా పేరు మార్చి మొక్కలు నాటించారు. కానీ ఉద్యమంలా చేపట్టినా ఈ కార్యక్రమం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదు. ప్రధానంగా రాష్ట్ర, జాతీయ రహదారుల వెంట నాటిన మొక్కలను గాలికి వదిలేశారు. ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌ను పూర్తి చేయడానికి అధికారులు ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ మొక్కలు నాటిస్తున్నారు. చేవెళ్ల-షాద్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా సుమారు 10 కిలోమీటర్ల మేర గతంలో మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం పెరిగి పెద్దయ్యాయి. ఆ చెట్ల ముందు రోడ్డు పక్కన మళ్లీ మూడు ఫీట్ల దూరంలో మొక్కలు నాటారు. ఇలా చెట్లు ఉన్నచోట మరోసారి మొక్కలు ఎందుకు నాటారనే విషయంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. పోనీ నాటిన మొక్కలనైనా సంరక్షిస్తారా అంటే అదీ లేదు. కనీసం ట్రీగార్డులు కూడా ఏర్పాటు చేయక పోవడంతో కొత్తగా నాటిన మొక్కలు ఎండి పోతున్నాయి. అంతేకాకుండా పశువులకు ఆహారంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల మొక్కలు వంగిపోతుండటంతో కర్రలు సపోర్టుగా పెట్టి వదిలేశారు. వాటికి నీరు

మిగతా 8వ పేజీలో...

నేడు ఉచిత వైద్యశిబిరం

కడ్తాల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిబిరంలో డాక్టర్ ఉప్పల అఖిల్, ఉప్పల అనిల్‌ల ఆధ్వర్యంలో వైద్య బృందం వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కర్కల్‌పహాడ్, సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం కప్ క్రీడాపోటీల్లో ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీలకు కొండకల్ స్కూల్ విద్యార్థి వరుణ్



వరుణ్‌గౌడ్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న అధికారులు

శంకర్‌పల్లి, షాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండకల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన గొండ్ల వరుణ్‌గౌడ్ సీఎం కప్-2024 క్రీడాపోటీల్లో భాగంగా జిల్లాస్థాయిలో ప్రతిభ చాటాడు. ఆదివారం నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో వరుణ్‌గౌడ్ షార్ట్‌పుట్, డిస్కస్‌త్రోలో మొదటి బహుమతి సాధించాడు. ఈమేరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు వరుణ్‌ను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా షాబాద్ మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో చదువుతున్న డి.శైలజ, అమూల్య, రమావతి, అఖిల, సమ్రత, ఇందు, జ్యోత్స్న తదితరులు వాలీబాల్ విభాగంలో పోటీపడి తృతీయ బహుమతి, అమల, శ్రీజ, శ్రీవాణి మొదటి బహుమతి, మమత, శ్రీవాణి, వైష్ణవి, సంధ్యారాణి, సృజన, వర్ష ద్వితీయ బహుమతి అందుకున్నారు. విద్యార్థులను ఎంజేపీ గురుకులం ఇన్‌చార్జి రాజశేఖర్, పీడీ బాలయ్య, ప్రిన్సిపాల్ శివరంజని అభినందించారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు



కుర్మిద్ద చర్చి

యాచారం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాల్లో చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని కుర్మిద్ద, చిన్న తూండ్ల, యాచారం, మాల్, గున్‌గల్, నజ్దిక్‌సింగారం, తాటిపర్తి తదితర గ్రామాల్లోని చర్చిలను ఆదివారం నుంచే విద్యుద్దీపాలతో ముస్తాబు చేస్తున్నారు. రాత్రివేళ రంగు రంగుల లైట్లలో చూడముచ్చటగా కనిపిస్తున్నాయి.

యథేచ్ఛగా రోడ్డుపై కొనసాగుతున్న విక్రయాలు



రోడ్డుపైనే సంత.. అడుగడుగునా అవస్థ

దారుల్లోనే కూరగాయల విక్రయాలు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- ఖాళీగానే నెహ్రూ మార్కెట్
- పట్టించుకోని పాలకులు

శంకర్‌పల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిలో కూరగాయల సంతను ప్రధాన రోడ్లపైనే నిర్వహిస్తుండటంతో వినియోగదారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్ నిర్వహణకు ప్రత్యేక స్థలం ఉన్నప్పటికీ దానిని వినియోగించడం లేదు. శంకర్‌పల్లిలో ఆదివారం, బుధవారం, శుక్రవారం రోజుల్లో సంత జరుగుతుంది. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట నిర్వహించే సంతకు శంకర్‌పల్లి చుట్టుపక్కల గ్రామాల రైతులు కూరగాయలు, పండ్లు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలను కుప్పలుగా పోసి అమ్మకాలు చేపడుతుండటంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.

నెహ్రూ మార్కెట్ అంతా ఖాళీ..

శంకర్‌పల్లి గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు కూరగాయల సంతను నెహ్రూ మార్కెట్‌లోనే నిర్వహించేవారు. అక్కడ కూరగాయల విక్రయం జరిగినప్పుడు

మిగతా 8వ పేజీలో...

సమస్యల పరిష్కారానికి

పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్



మాట్లాడుతున్న కాడిగల్ల భాస్కర్

ఆమనగల్లు , డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పెట్టుబడిదారుల, కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ ఆరోపించారు. ఆమనగల్లులో ఆదివారం మాస్టర్‌డిగ్రీ కళాశాల ఆవరణలో సీపీఎం ఆమనగల్లు ఏరియా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ అబద్ధాల హామీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడం విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వం కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. సమావేశంలో పార్టీ ఏరియా కమిటీ కన్వీనర్ కానుగుల వెంకటయ్య, నాయకులు పిప్పళ్ల శివశంకర్, జిల్లెల్ల పెంటయ్య, గుమ్మడి కురుమయ్య, కొమ్ము చెన్నయ్య, పట్నం నర్సింహ్మ, హంసమ్మ, రమేశ్, పోచయ్య తదితరులు ఉన్నారు.

ధ్యాన మార్గంతో

సంకల్పశక్తి



మాట్లాడుతున్న సినీ ఫైట్‌మాస్టర్లు రామ్‌లక్ష్మణ్



- పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి
- కొనసాగుతున్న ధ్యాన మహాయాగం వేడుకలు
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న ధ్యానులు
- ఆకట్టుకున్న నృత్యాలు, ఆధ్యాత్మిక సందేశాలు

కడ్తాల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మానవతా విలువల పెంపు, ఆరోగ్య సమాజ నిర్మాణం, ఆనందమయ జీవనానికి ధ్యానం గొప్ప మార్గమని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ధ్యానంతో సహనం, సంకల్పశక్తి సిద్ధిస్తుందని, అది వ్యక్తి పురోగమనానికి దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో ధ్యాన మహాయాగం-3 వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. రెండవరోజు ఆదివారం తెలుగు రాష్ట్రాల నుండి ధ్యానులు, సాధకులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక వేత్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 4 గంటల నుంచి 5 గంటల వరకు మాస్టర్ వెంకటేశ్ యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా చైతన్య, తేజలు వేద పఠనం నిర్వహించారు. అనంతరం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఫ్లూట్ మాస్టర్ గణేశ్, సంజయ్‌కింగ్‌ల బృందం సంగీత నాద గానంతో ప్రాతఃకాలం సామూహిక ధ్యానం నిర్వహించారు. అనంతరం పత్రీజీ

మిగతా 7వ పేజీలో...

● పరిగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పరిగిలో ఎన్‌వీ చాంపియన్ టెన్నిస్ స్పోర్ట్స్ అకాడమీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, నాయకులు ఉన్నారు.

గుంతల రోడ్డుకు మోక్షం

- సాఫీగా సాగుతున్న ప్రయాణం
- రూ.2 కోట్లతో 1.2 కి.మీ. బీటీ రోడ్డు
- వాహనదారులు, ప్రయాణికుల హర్షం

ఆదిభట్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పాడైపోయిన అంతర్గత రోడ్లతో పాటు, ప్రధాన రోడ్ల నిర్మాణంపై పాలకవర్గం దృష్టి సారించింది. మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్డు ఎంపీ పటేల్‌గూడ నుంచి బొంగ్లూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వరకు రోడ్డు గుంతలమయంగా ఉండేది. దాంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడేవారు. దాంతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి రూ.2కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈమేరకు బొంగ్లూర్ నుంచి ఎంపీ పటేల్‌గూడ రోడ్డు వరకు 1.2 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టారు. దాంతో వాహనదారులు, ప్రయాణికులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపీ పటేల్‌గూడ రోడ్డు నుంచి బొంగ్లూర్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. దాంతో మున్సిపాలిటీకి కొత్త శోభ సంతరించుకుంది. ఏళ్ల తరబడి రోడ్లు బాగా లేకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు, నానా ఇబ్బందులు పడ్డారు.



ఎంపీ పటేల్‌గూడ నుంచి బొంగ్లూర్ మధ్య వేసిన డబుల్ రోడ్డు

ఇబ్బందులు తీరాయి



బొంగ్లూర్ గ్రామం నుంచి చౌరస్తా వరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో గతంలో వాహనాదారులు ఈ రహదారిపై ప్రయాణమంటేనే భయపడేవారు. డబుల్ రోడ్డు వేయడంతో ఇబ్బందులు తప్పాయి. రోడ్డు అందుబాటులోకి రావడంతో వాహనదారులు, ప్రయాణికుల కష్టాలు తీరాయి. చాలా వరకు ప్రమాదాలు కూడా తగ్గాయి.

- మర్రి అర్చనా రాంరెడ్డి, కౌన్సిలర్, బొంగ్లూర్

అంతర్గత రోడ్లు, డ్రైనేజీపై వ్యవస్థపై దృష్టి



ఆదిభట్ల మున్సిపాలిటీలో ప్రధాన సమస్యలపై దృష్టిపెట్టాం. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీకి అధిక నిధులు తీసుకొస్తాం. ఇప్పటికే చాలావరకు కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేశాం.

- మర్రి నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, ఆదిభట్ల

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఆమనగల్లు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం దశలవారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు వస్పుల శ్రీశైలం అన్నారు. పేదల సొంతింటి కల త్వరలోనే సాకారం కాబోతుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ నవచైతన్య కాలనీలో ఆదివారం శ్రీశైలం పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల సర్వేను ఆయన పరిశీలించారు. వార్డు ఇన్‌చార్జి హేమలత, జంతుకగిరి తదితరులు ఉన్నారు.

న్యాయ పోరాటంతోనే ప్లాట్లను సాధించుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది జుబేర్ అక్రం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): న్యాయపోరాటంతోనే ప్లాట్లను సాధించుకుంటామని కొర్రెముల ఏకశీలనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. కొర్రెముల ఏకశీల నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ న్యాయవాది జుబేర్ అక్రం మాట్లాడుతూ.. అన్ని కేసుల్లో కొర్రెముల ఏకశీల నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ విజయం సాధించిందని తెలిపారు. కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 739 నుంచి 749లలోని 140 ఎకరాల్లో 1985లో ఏకశీలనగర్ వెంచర్ చేశారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ప్లాట్లు క్రయవిక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. 2006లో బిల్డర్ వెంకటేష్ అందులోని సర్వేనెంబర్లు 739, 740, 741, 742 పార్టు పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి పట్టాదారు పాసుపుస్తకాలు పొంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారని తెలిపారు. పట్టదారుపాసుపుస్తకాలకు సంబంధించిన మ్యూటేషన్‌ను న్యాయస్థానం 2009లో రద్దుచేసిందని తెలిపారు. ఇలా అన్ని కేసుల్లో బిల్డర్ వెంకటేష్ అపజయం పొందారని చెప్పారు. డబ్బు, పోలీసు బలంతో ఏకశీల నగర్ వెంచర్‌లోకి ప్లాట్ల ఓనర్స్‌ను రానివ్వడం లేదని ఆరోపించారు. అన్ని అనుమతులతో ఇళ్ల నిర్మాణం సైతం చేపడుతామని ధీమా వ్యక్తంచేశారు. ఏకశీల నగర్ ప్లాట్ల ఓనర్స్ విజయం సాధించే తరుణం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏకశీల నగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావ్, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి విజయసేనారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు



రైతులకు ఇంటి స్థలాల పట్టాలు అందిస్తున్న తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్

కొడంగల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెడికల్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటులో భాగంగా సర్వే నెంబర్ 19లో భూములు ఇచ్చిన రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సర్వే నెంబర్ 19 పరిధిలోని అసైన్డ్ భూములకు పరిహారం అందించగా ఇంటి స్థలాల పట్టాలను అందించే ప్రక్రియను వేగవంతం చేశారు. రెండు రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పలువురు రైతులకు పట్టాలు అందించగా.. మిగతా వారికి పూర్తిస్థాయిలో అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, పరిహారం పూర్తిస్థాయిలో అందించిన తర్వాత పనులు చేపట్టాలని రైతులు ఇటీవలే సర్వే సిబ్బందితో తెలిపారు. దాంతో అధికారులు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బ్రాహ్మణ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

చేవెళ్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని చేవెళ్ల నియోజకవర్గం బ్రాహ్మణ సేవా సంఘం సమైఖ్య నాయకులు సృజన్, శ్రీధర్, గీతానందరావు, కన్నా తెలిపారు. ఈమేరకు ఈనెల 29న నగరంలోని రవీంద్ర భారతిలో నిర్వహించే సమ్మేళనం పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆవిష్కరించారు. నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో చిన్నారులకు దేహదారుఢ్యం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌తో చిన్నారులకు దేహదారుఢ్యంతో పాటు మనోధైర్యం పెరుగుతుందని మద్దూరి ఫౌండేషన్ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్ గౌడ్ అన్నారు. షాద్‌నగర్ గ్రీన్‌పార్క్ ఫంక్షన్‌హాలులో ఆదివారం టాటారత్న మెమోరియల్ టోర్నమెంట్ పేరిట సౌత్ ఇండియన్ కుంగ్‌ఫూ కరాటే థైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహించారు. ముగింపు ఉత్సవానికి బీజెపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై బహుమతులందించారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలి

యాచారం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ పదవులు ముఖ్యం కాదని, పేదల కష్టాలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రతీ కార్యకర్త చొరవ తీసుకోవాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ, ఎండీ అక్బర్‌లు తెలిపారు. ఆదివారం యాచారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డైరెక్టర్లను కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎంపీపీ పదవులను అత్యధిక సంఖ్యలో దక్కించుకునేందుకు కృషి చేయాలన్నారు. తిరుమలేష్, భాస్కర్‌గుప్తా, భట్టు శ్రీనివాస్, వెంకటరెడ్డి, లక్ష్మయ్య తదితరులున్నారు.

ఈటల ఆధ్వర్యంలో బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని హకీంపేట, సింగాయిపల్లి ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో ఆయన నివాసంలో బీజేపీలో చేరారు. ఈమేరకు బీజేపీ జిల్లా కార్యదర్శి హైమారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి రాజేందర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెన్న కిషన్‌రెడ్డికి లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ అవార్డు



చెన్న కిషన్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపిక బహూకరిస్తున్న పెట్రిషియో, ఏపీ సింగ్, పాటిహిల్

కడ్తాల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా లయన్స్‌క్లబ్ ద్వారా సేవలందిస్తున్న కడ్తాల మండల కేంద్రానికి చెందిన క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డిని లయన్స్ క్లబ్ అంతర్జాతీయ అవార్డు వరించింది. ఈమేరకు అంతర్జాతీయ క్లబ్ అధ్యక్షుడు పెట్రిషియో, ఉపాధ్యక్షుడు ఏపీ సింగ్, అంతర్జాతీయ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పాటిహిల్, డైరెక్టర్ బాబురావులు ఆయన్ను అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 52వ ఇసామి సమావేశంలో చెన్నకిషన్‌రెడ్డి సేవలను వారు కొనియాడారు. రెండు దశాబ్దాలుగా లయన్స్‌క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలను అభినందించి సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కోసం అత్యధికంగా విరాళాలను సేకరించిన చెన్నకిషన్ రెడ్డిని అంతర్జాతీయ స్థాయి సభ్యులు అభినందించారు. దాతలు ముందుకు వచ్చి లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు తమ వంతు విరాళాలు అందిస్తే సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 8 జిల్లాల్లో దేశంలోనే అత్యధికంగా విరాళాలు సేకరించినట్లు చెన్నకిషన్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, కోటేశ్వర్ రావు, మహేంద్రకుమార్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పాషా, మహేశ్, గుజ్జరి నర్సింహ, అంజయ్య, భిక్షపతి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ చరిత్రను ప్రజలకు చాటి చెప్పాలి

పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య



షాద్‌నగర్ అర్బన్: పోస్టర్‌ను విడుదల ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్/షాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) చరిత్రను, సాధించిన ఉద్యమ ఫలితాలను ప్రజలకు వివరించాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో శత వసంతోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం షాద్‌నగర్‌లో నాయకులతో కలిసి జంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరంతో పాటు పేదలకు భూమి, భుక్తి నుంచి కల్పించాలని ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన పోరాటాలు చేస్తున్న సీపీఐ చరిత్రను ప్రతీ వ్యక్తికి తెలియజేయాలన్నారు. 99 సంవత్సరాలు పూర్తిచేసుకుని వందేళ్లకు చేరుతున్న సందర్భంగా చేవెళ్ళ, ఎల్బీనగర్ ప్రాంతాలలో భారీ బహిరంగ సభలను నిర్వహించబోతున్నట్లు జంగయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి పర్వతాలు, శ్రీనునాయక్, చందుయాదవ్, లింగం నాయక్, చంద్రబాబు, కిషన్, పవన్ చౌహన్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా షాబాద్ మండల కేంద్రంలో సీపీఐ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని నాయకులతో కలిసి జంగయ్య పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26న రంగారెడ్డి జిల్లాలోని గ్రామగ్రామాన పార్టీ జెండాలను ఎగురవేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, షాబాద్ మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు రాములు, శేఖర్, శ్రీశైలం, రాములు, రఘురాం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి తోడ్పడాలి

- బీహెచ్‌ఈఎల్ మాజీ సీఎండీ ప్రసాదరావు
- శామీర్‌పేటలోని ఐపీఈలో అలుమ్నీ మీట్-2024



మాట్లాడుతున్న బెల్ మాజీ సీఎండీ ప్రసాదరావు

శామీర్‌పేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఐపీఈలో చదువుకున్న విద్యార్థులు వృత్తిలో అంకితభావం కలిగి ఉంటూ ఉత్తమ సేవలందించి దేశాభివృద్ధికి బాధ్యతగా తోడ్పడాలని బీహెచ్‌ఈఎల్(బెల్) మాజీ సీఎండీ, ఐపీఈ గవర్నింగ్ బోర్డ్ మెంబర్ ప్రసాదరావు హితవు పలికారు. శనివారం సాయంత్రం శామీర్‌పేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపీఈ)లో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అలుమ్నీ మీట్-2024(పూర్వ విద్యార్థుల సమావేశం) నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాదరావు మాట్లాడుతూ ఐపీఈలో చదువు పూర్తిచేసిన విద్యార్థులు భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. ఐపీఈ బోర్డ్ గవర్నింగ్ అధ్యక్షుడు కాకి మాధవరావు(రిటైర్డ్ ఐఏఎస్) మాట్లాడుతూ ఆర్థిక విలువలకంటే మానవ విలువలు ఎంతో ముఖ్యమని చెప్పారు. ఐపీఈ విద్యార్థులు మంచి విలువలతో కూడిన విద్యనభ్యసిస్తూ జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని, సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు. ఐపీఈ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసమూర్తి అలుమ్నీ మీట్‌కు వచ్చిన పూర్వ విద్యార్థులకు, అతిథిలకు ఘన స్వాగతం పలికారు. ఐపీఈలో పీజీడీఎం ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్, పూర్తి పీజీపీ నమోదు చేసుకున్న విద్యార్థులకు రూ2కోట్ల స్కాలర్‌షిప్‌లతో పాటు ఆధునిక సౌకర్యాలను అందిస్తు విద్యార్థులకు సంస్థ చేయూతనిస్తోందని వివరించారు. కాగా, ఐపీఈలో నిర్వహించిన అలుమ్నీ మీట్‌లో చాలామంది పూర్వవిద్యార్థులు పాల్గొని ఒకనొకరు పలకరించుకున్నారు. కార్యక్రమంలో 1995-97 నుంచి 2022-24 ఐపీఈలో విద్యనభ్యసించిన విద్యార్థులు, మాజీ సీజీఎం మహపరా అలీ, పూర్వవిద్యార్థుల రిలేషన్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ముజామిల్ అహ్మద్ బాబా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విలీనంపై కసరత్తు

- పరిగి మున్సిపాలిటీలోకి ఆరు గ్రామాలు
- వ్యతిరేకిస్తున్న ఐదు గ్రామాల ప్రజలు
- ప్రస్తుత పాలకవర్గానికి దగ్గరపడుతున్న గడువు
- విలీన గ్రామాలతోనే పురపాలక సంఘానికి ఎన్నికలు?



పరిగి పురపాలక సంఘం కార్యాలయం

పరిగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పరిగి మునిసిపాలిటీని విస్తరించనున్నారు. ప్రస్తుతం ఉన్న పురపాలక సంఘంలో కొత్తగా ఆరు గ్రామ పంచాయతీలు విలీనం కానున్నాయి. ఇందుకు సంబంధించి ప్రక్రియను అధికారులు కసరత్తు చేస్తున్నారు. రెండు రోజుల కిందట రాష్ట్రంలో కొత్తగా రెండు, కార్పొరేషన్లు, 12మున్సిపాలిటీల ఏర్పాటుతో పాటు ఐదు కిలోమీటర్ల దూరంలోపు ఉన్న గ్రామాలను విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల అసెంబ్లీ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా పరిగి మున్సిపాలిటీ విస్తరణపై మాట్లాడిన సంగతి తెలిసిందే. గతంలో పంచాయితీగా ఉన్న పరిగి 2018 ఆగస్టు 2న మున్సిపాలిటీగా అవతరించింది. పరిగి మునిసిపాలిటీ 15వార్డుల విభజనతో 2020 జనవరిలో ఎన్నికలు జరుగగా, వచ్చే జనవరి నాటికి పాలక వర్గం గడువు ముగుస్తుంది. కొత్తగా విలీనం కానున్న గ్రామాలతోనే వచ్చే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు కిలోమీటర్ల పరిధి వరకు ఉన్న గ్రామాలకు మునిసిపాలిటీలో విలీనం చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పరిగి మునిసిపాలిటీ పరిధిలో 15వార్డులు 5,132 కుటుంబాలు ఉన్నాయి. 2011లెక్కల ప్రకారం 18,241 జనాభా ఉంది. ప్రస్తుతం అంచనా మేరకు 35వేల వరకు జనాభా ఉంటుంది. తాజాగా పరిగిలో 18,541 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 10,312 పురుషులు, 10,053 మంది మహిళా ఓటర్లు ఉంటారు. ఆరుగ్రామాల విలీనంతో ఓటర్ల సంఖ్య భారీగా పెరుగనుంది. కొత్తగా 6650మంది ఓటర్లు మునిసిపల్ పరిధిలోకి రానున్నారు. విలీన గ్రామాలతో పరిగి మునిసిపల్ పరిధిలో 15నుంచి 22 వార్డులకు పెరిగే అవకాశం ఉంది.

విలీనం కానున్న గ్రామాలివే..

పరిగి మున్సిపాలిటీకి ఐదు కిలోమిటర్ల పరిధిలోని ఉన్న ఆరుగ్రామాలను విలీనం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల వివరాలను అధికారులు మునిసిపల్ శాఖకు పంపించారు. ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న సుల్తాన్‌పూర్, సయ్యద్‌మల్కాపూర్, రుకుంపల్లి, నస్కల్, నజీరాబాద్, శాఖాపూర్ గ్రామాలను పరిగి మున్సిపాలిటీలో విలీనానికి సిద్ధం చేశారు. నస్కల్ గ్రామంలో 964 కుటుంబాలు ఉండగా, 2606మంది ఓటర్లు ఉన్నారు. నజీరాబాద్‌లో 388కుటుంబాలకు గాను 1035ఓటర్లు, సయ్యద్‌మల్కాపూర్‌లో 327కుటుంబాలకుగాను 830 ఓటర్లు, రుకుంపల్లిలో 198 కుటుంబాలకు గానూ 573మంది ఓటర్లు ఉన్నారు. శాఖాపూర్‌లో నివాసాలు లేవు. ఈగ్రామ పరిధిలో భూములు మాత్రమే ఉన్నాయి.

వ్యతిరేకిస్తున్న ఐదు గ్రామాలు

పరిగి మున్సిపాలిటీలో విలీనానికి ఐదుగ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. సుల్తాన్‌పూర్, సయ్యద్‌మల్కాపూర్, రుకుంపల్లి, నస్కల్, నజీరాబాద్, శాఖాపూర్ గ్రామాలు మున్సిపాలిటీలో విలీనానికి ప్రతిపాదించారు. అయితే ఐదు గ్రామాల ప్రజలు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. సుల్తాన్‌పూర్, సయ్యద్‌మల్కాపూర్, రుకుంపల్లి, నస్కల్, నజీరాబాద్ గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించగా ప్రజలు తమ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నస్కల్ గ్రామస్తులు వందలాది మంది వచ్చి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసి మునిసిపాలిటిలో కలపొద్దని విన్నవించారు. పట్టణ పరిధిలోకి వెళ్తే ప్రధానంగా ఉపాధి హామీ పథకం వర్తించదని, అదేవిధంగా ప్రభుత్వం అమలు చేసే అనేకరకాల పథకాలకు దూరం అవుతామని ప్రజలు భావిస్తున్నారు.

సాగుచేసే రైతులందరికీ 'రైతు భరోసా'

ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ



ఆమనగల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సాగే చేసే ప్రతీ రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ తెలిపారు. జనవరి నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గీత మాట్లాడుతూ రైతు భరోసా విషయంలో అనుమానాలు, అపోహలకు తావులేదన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా ఎకరాకు రూ. 15 వేలు పెట్టుబడి సాయం అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. సాగు చేయని భూములకు పెట్టుబడి సాయం ఇవ్వమంటే.. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నో అక్రమాలు చోటు చేసుకొని ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా చేపడుతోందని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికే ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలు సత్ఫలితాలిస్తున్నాయని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని గీత తెలిపారు.

సాగుభూముల మీదుగా హైటెన్షన్ లైన్ ఏర్పాటు చేయొద్దు

ఎంపీ మల్లు రవికి కడ్తాల రైతుల వినతి



ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న పంట పొలాల నుంచి హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయకుండా చూడాలని కడ్తాల రైతులు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని కోరారు. 765 కేవీ హైటెన్షన్ పోల్ సర్వే మార్కింగ్‌ను వెంటనే నిలిపివేయించి తమ ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహలతో కలిసి డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణల ఆధ్వర్యంలో రైతులు ఎంపీ మల్లు రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయేతర పొలాల మీదుగా ఇతర ప్రాంతం నుంచి లైన్‌ను ఏర్పాటుచేసి తమకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. కడ్తాల గ్రామాన్ని అనుసరించి 66 సర్వే నెంబర్లలోని 150 మంది రైతుల పంటపొలాల మీదుగా 765కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌అండ్‌టీ సంస్థ శ్రీకారం చుట్టి లైన్ మార్కింగ్ చేశారని ఎంపీకి వివరించారు. బీదర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఏర్పాటుచేసే కొత్త హైటెన్షన్ లైన్‌ను తమ పొలాల మీదుగా ఏర్పాటు చేస్తే రూ.కోట్ల విలువైన భూములు కోల్పోయి రైతులు రోడ్డున పడతారని నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామాన్ని అనుసరించి లైన్ ఏర్పాటు చేయడం వల్ల దినదినాభివృద్ధి చెందుతున్న కడ్తాల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, లైన్ ఏర్పాటు మార్గంలో అనేక చోట్ల వెంచర్లు, కోళ్ల పరిశ్రమలు, పాడిషెడ్లు, వ్యవసాయ బోర్లు ఉన్నాయని ఎంపికి వివరించారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని హైటెన్షన్ పోల్ అలైన్‌మెంట్ మార్పించాలని శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనర్సింహరెడ్డి, రామకృష్ణలు విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లి హైటెన్షన్ లైన్‌ను మార్చేలా చూస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు అభిషేక్ రెడ్డి, కాంటేకార్ శ్రీను, గోరటి శేఖర్, క్యామ రాజేశ్, బోసు రవి, పెంటారెడ్డి, రాములు, జంగారెడ్డి, జంగయ్య, తిరుపతిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పాండు,మల్లేశ్, గణేశ్, శేఖర్‌రెడ్డి, శివకుమార్, సేవ్యానాయక్, చెన్నయ్య, మహేశ్, స్వామి, శ్రీకాంత్, జంగయ్య, రమేశ్, రవి, నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్‌పతినాయక్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జ్ఞానవత్సల స్వామి

ధ్యాన మార్గంతో సంకల్ప శక్తి

(5వ పేజీ తరువాయి..)

వీడియో సందేశాలను వినిపించారు. ఈసందర్భంగా పత్రీజీ కూతురు పరిణితి మాట్లాడుతూ ప్రపంచాన్ని ధ్యానమయం చేసే లక్ష్యంతో ప్రతిజ్ఞరూ ముందుకు సాగాలన్నారు. కర్నూల్‌లో పత్రీజీ ప్రారంభించిన ధ్యాన విప్లవం నేడు విశ్వవ్యాప్తం అయ్యిందన్నారు. ప్రముఖ సినీఫైటర్స్ రామ్‌లక్ష్మణ్‌లు మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాసే ధ్యానమని, దాన్ని ప్రతీ ఒక్కరు ఆచరించి ఆనందమయ జీవితాన్ని పొందాలన్నారు. మందులతో నయం కాని ఎన్నో రుగ్మతలు ధ్యానం, యోగ ద్వారా తొలిగిపోతాయని వారు పేర్కొన్నారు. గుజరాత్ స్వామి నారాయణ ఆలయ అర్చకుడు జ్ఞానవత్సల స్వామి పిరమిడ్‌ను సందర్శించి ధ్యానులనుద్దేశించి సందేశమిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లీలాలక్ష్మారెడ్డి, స్వాధ్యాయ యోగ నిర్వాహకుడు శ్రీనివాస్ రెడ్డి, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు ఆనంద్ దాలీయా, జగదీశ్ రెడ్డి, కిషన్ రెడ్డి, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు హన్మంతరావు, సాంబశివరావు, మాధవి, లక్ష్మి, దామోదర్ రెడ్డి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



కందుకూర్: మహాపడి పూజలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కందుకూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు అయ్యప్ప మాలలు ధరించడం శుభపరిణామమని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన యువకులు 26 మంది నలభై ఐదు రోజులక్రితం అయ్యప్ప మాలలు ధరించారు. ఈమేరకు ఆదివారం కందుకూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన అయ్యప్ప ఇరుముడి మహాపడి పూజలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ రెండు నెలలుగా ఏ గ్రామానికి వెళ్లినా అయ్యప్ప నామస్మరణతో భక్తి వాతావరణం నెలకుంటోందని గుర్తుచేశారు. ప్రతీ ఒక్కరు దైవభక్తిని పెంపొందించుకోవాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు తాళ్ల అనురాధ, కాసుల రామకృష్ణారెడ్డి, సాధ మల్లారెడ్డి, నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, తాళ్ల కార్తీక్, ఏజీ దామోదర్‌గౌడ్, సామ ప్రకాశ్‌రెడ్డి, పొట్టి ఆనంద్, ఎస్. శేఖర్‌గౌడ్, ఎస్. వెంకటేస్‌గౌడ్, బొక్క దీక్షిత్‌రెడ్డి, కె.ప్రశాంత్‌చారి, గణేష్, అంజయ్య, జంగయ్య, ఉదయ్‌కిరణ్, అఖిల్, సతీష్, శ్రీధర్, తిరుపతయ్య, రామిడి రాంరెడ్డి, కామేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదం వితరణ చేశారు.

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లిలో అయ్యప్పస్వామి నామస్మరణతో గ్రామం మారుమోగింది. వివిధ గ్రామాలకు చెందిన దీక్షాపరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. చందర్‌నాయర్‌గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాదులు నిర్వహించారు. మహపడిపూజ అనంతరం దీక్షాపరులు ఇరుముడి కట్టించుకొని ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దీక్షా పరులు ఇరుముడితో శబరియాత్రకు బయల్దేరారు.



మొయినాబాద్ రూరల్ : పూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని సురంగల్ గ్రామం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. 41 రోజుల పాటు అయ్యప్పదీక్ష చేసి శబరిమలకు బయలుదేరుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన మహాపడిపూజ, ఇరుముడి పూజ వైభవంగా నిర్వహించారు. ఈగ సాయి కిరణ్‌రెడ్డి, ఈగ యాదిరెడ్డిలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన పూజలో స్వాములు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రత్యేక పూజలు చేశారు.

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగిలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొని పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, నాయకులు ఆంజనేయులు, ఎం.రాజేందర్, బి.ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని రాళ్లగూడుపల్లిలో మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎం.సావిత్రమ్మ రాములుగౌడ్ కుమారుడు బాలకృష్ణగౌడ్ స్వగృహంలో అయ్యప్ప పడి పూజ నిర్వహించారు.

చికెన్ బిర్యానీలో బ్లేడ్!

- కస్టమర్ల అవాక్కు.. పోలీసులకు ఫిర్యాదు
- కావాలనే చేశారు : రెస్టారెంట్ యాజమాన్యం



చికెన్ బిర్యానీలో బ్లేడ్

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హోటళ్లలో తినే పదార్థాల్లో సహజంగా పురుగులు, బొద్దింకలు రావడం చూశాం. కానీ ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఏకంగా బిర్యానీలో బ్లేడ్ వచ్చింది. ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా, బీబీనగర్ మండలం, మక్త అనంతారంనకు చెందిన బింగి అయిలయ్యయాదవ్ ముగ్గురు స్నేహితులతో కలిసి ఘట్‌కేసర్ బైపాస్‌లోని ఆదర్శ్ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ చికెన్ బిర్యానీ ఆర్డర్ చేయగా.. వెయిటర్ బిర్యానీ తీసుకొచ్చాడు. అనంతరం బిర్యానీ తింటుండగా.. అందులో బ్లేడ్ ప్రత్యక్షమైంది. బార్ యాజమాన్యాన్ని పిలిచి బిర్యానీలో బ్లేడ్ వచ్చిందని నిలదీయగా.. నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దాంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో అయిలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, బిర్యానీలో బ్లేడ్ వచ్చిందని కావాలనే క్రియేట్ చేశారని ఆదర్శ్ బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం తెలిపింది. బిర్యానీ చేసే క్రమంలో బియ్యాన్ని నీళ్లలో మూడుసార్లు కడిగి వడబోస్తామని, అప్పుడు రాని బ్లేడ్ తరువాత ఎలా వచ్చిందన్నారు. కావాలనే బార్ పరువు తీయాలని అలా చేశారని బార్ యాజమాన్యం వివరణ ఇచ్చింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రెస్టారెంట్ నిర్వాహకులు తెలిపారు.

బిర్యానీలో ఇనుప ముక్కలు! కస్టమర్లపై హోటల్ నిర్వాహకుల దాడి

షాబాద్‌ను... పూడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హోటల్‌లో భోజనం చేసేందుకు వచ్చిన యువకులను హోటల్ యజమాని వర్కర్లతో కలిసి దాడిచేసి చితకబాదారు. ఈ సంఘటన పూడూరు మండల పరిధిలోని చిట్టెంపల్లి గేటు సమీపంలోని నక్షత్ర రెస్టారెంట్‌లో చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం రేగడిఘనాపూర్‌నకు చెందిన ఆరుగురు యువకులు ఆదివారం మధ్యాహ్నం నక్షత్ర రెస్టారెంట్‌లో భోజనానికి వెళ్లారు. అనంతరం బిర్యానీ ఆర్డర్ ఇచ్చారు. వెయిటర్ బిర్యానీ తెచ్చి ప్లేట్లో పెడుతుండగా ఇనుప ముక్కలు వచ్చాయి. యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా.. వేరే బిర్యానీ ఇచ్చారు. అది కూడా నాసిరకంగా ఉండటంతో యువకులు, నిర్వాహకుల మధ్య మాటా మాటా పెరిగింది. నక్షత్ర హోటల్ యజమాన్యం ఆరుగురు యువకుల్లో నలుగురు యువకులను చితకబాదగా ఇద్దరు తప్పించుకున్నారు. యువకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదనరెడ్డి చెప్పారు.

రైల్వే బ్రిడ్జి రోడ్డు.. రయ్‌రయ్!

- కొత్తూర్ రైల్వే వంతెనకు రెండు వైపులా అదనంగా పది ఫీట్ల మేర రోడ్డు వెడల్పు
- త్వరలోనే పూర్తి కానున్న పనులు
- తొలగనున్న వాహనదారుల ఇక్కట్లు


రోడ్డు పనుల కోసం కొత్తూర్ రైల్వే బ్రిడ్జి వద్ద ముళ్ల పొదలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కొత్తూర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన కొత్తూర్ రైల్వే బ్రిడ్జికి రెండు చివర్లకు ఇరుకైన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 44వ నంబర్ హైవేపై ఇక్కడి నుంచే వెళ్లేది. ఇక్కడ తరుచూ ట్రాఫిక్ జామ్ అయ్యేది. ఇప్పుడు హైవే బైపాస్ కాగా రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు మరింత వెడల్పుతో వాహనదారుల సమస్యలు తీరనున్నాయి. కొత్తూర్ సమీపంలో రైల్వే బ్రిడ్జి ఉంది. బ్రిడ్జికి రెండు చివర్లలో కిలో మీటరు మేర బీటీ రోడ్డుంది. కొత్తూర్ నుంచి షాద్‌నగర్ సమీపంలో ఉన్న సోలీపూర్ వరకు పాత జాతీయ రహదారిని నాలుగు లేన్లకు విస్తరించారు. నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. కానీ కొత్తూర్ రైల్వే బ్రిడ్జి వద్ద బీటీ రోడ్డును వెడల్పు చేయలేదు. రోడ్డు వెడల్పునకు రైల్వేశాఖ చర్యలు తీసుకోలేదు. దీంతో ఇరుకు రోడ్డుతో ఇన్నేళ్ల పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకొని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆయా శాఖల అధికారులతో చర్చించారు. రైల్వే బ్రిడ్జికి రెండు చివరల్లో రోడ్డును పది ఫీట్ల వెడల్పు చేసి సీసీ వేయాలని నిర్ణయించి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. సీసీ నిర్మాణంతో రోడ్డు ఇప్పుడున్నదానికి అదనంగా 10 ఫీట్ల మేర వెడల్పు కానుంది. దీంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయి. వారం రోజుల్లో పనులు పూర్తిచేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్న సమస్య త్వరలో తీరనుండడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్, మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డిలు ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


చురుగ్గా రైల్వే బ్రిడ్జి రోడ్డు వెడల్పు పనులు

సంక్షేమ గురుకులాల నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ ఉండాలి



గురుకులం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) మండల అధ్యక్షుడు చరణ్‌గౌడ్ అన్నారు. మండలంలో గల పలు గురుకులాలను ఆదివారం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ.. కొన్ని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో హాస్టళ్లలో ఉన్న పరిస్థితులను తెలుసుకునేందుకు వాటిని సందర్శించామన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. హాస్టళ్లకు కాంట్రాక్టర్లు పరిశుభ్రమైన కూరగాయలు, ఇతర వంట సామగ్రిని సరఫరా చేయాలని, కిచెన్ రూంలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గురుకులాలపై నిత్యం రెవెన్యూ, సంక్షేమ శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు.కార్యక్రమంలో చందు, సాయిగౌడ్, ప్రదీప్, రాహుల్, విష్ణుగుప్తా ఉన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా కృషి


కోర్టు ఉత్తర్వులోని అంశాలను ఎమ్మెల్యే శంకర్‌కు వివరిస్తున్న రమేష్

కేశంపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోమాల్‌పల్లి గ్రామ రైతులు 765కేవీఏ హైటెన్షన్ లైన్ రూటు మార్చాలని గతంలో హై కోర్టులో రిట్ పిటిషన్ వేశారు. కాగా తాజాగా వచ్చిన కోర్టు ఉత్తర్వులపై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనమగళ్ల రమేష్ ఆదివారం ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌కు వివరించారు. క్యాంప్ కార్యాయలంలో ఎమ్మెల్యేను కలిసి కేసు వివరాలను రమేష్ తెలిపారు. గత నెలలో హైకోర్టులో పిటిషన్ వేయగా జస్టిస్ మౌసుమీభట్టాచార్య ఈ నెల 5న ఉత్తర్వులిచ్చారని వివరించారు. ఉత్తర్వు కాపీ శనివారం వచ్చిందని ఎమ్మెల్యేకు తెలిపారు. మహేశ్వరం నుంచి బీదర్ వరకు వేసే 765కేవీఏ విద్యుత్ లైన్ పోమాల్‌పల్లి శివారులో రూటుమార్చి రైతులకు, గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోర్టును కోరామన్నారు. ఈ అంశంపై పవర్‌గ్రిడ్ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేవిధంగా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని రమేష్ చెప్పారు.

దుకాణ సముదాయ నిర్మాణం కోసం ఎంపీకి వినతి

ఆమనగల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాలుగు మండలాల కూడలి ఆమనగల్లులోని మండల పరిషత్, బాలుర ఉన్నత పాఠశాలల వద్ద దుకాణ సముదాయాలు నిర్మించి చిరు వ్యాపారులను ఆదుకోవాలని ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ ఎంపీ మల్లు రవిని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం గురించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయామన్నారు. గతంలో రోడ్ల పక్కనున్న హోటళ్లు, దుకాణాలు, డబ్బాలను హైవే విస్తరణలో తొలగించారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వీలైనంత త్వరగా దుకాణ సమదాయ నిర్మాణానికి కృషిచేస్తానని ఎంపీ రవి హామీ ఇచ్చినట్లు కేశవులు తెలిపారు. కార్యక్రమంలో చిరు వ్యాపారుల సంఘం నాయకులు రూపం వెంకట్‌రెడ్డి, దాసం నరేందర్, భీమనపల్లి సుధాకర్, ఎండీ రజాక్, జాని, చిరు వ్యాపారులు తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గణిత ఫోరం షాద్‌నగర్ శాఖ అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో ఆదివారం ఫరూఖ్‌నగర్ ఎమ్మార్సీ ఆవరణలో శ్రీనివాసరామానుజన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ... గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని దేశ వ్యాప్తంగా గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. శ్రీనివాసరామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు గణితంలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మ్యాథ్స్ టీచర్లు దొంతు పాండురంగయ్య, గణేష్‌కుమార్, మల్లేష్, బాబూచాంద్, ప్రకాశ్, సురేందర్‌రెడ్డి, శైలజ పాల్గొన్నారు.



రామానుజన్ విగ్రహానికి టీచర్ల నివాళులు

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి


కందవాడలో ఆంజనేయస్వామి పల్లకీని మోస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కందవాడలో హనుమాన్ జయంతి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో స్వామివారికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. అరాధన సేవకు నిలువెత్తు సాక్ష్యం హనుమంతుడన్నారు. ధైర్యం, వీరత్వం, మానవత్వం, బలం, జ్ఞానం, భక్తి వంటి లక్షణాలు నేటి యువతరానికి ఆదర్శనీయమన్నారు. యువత ధర్మాన్ని కాపాడాలని సూచించారు. అనంతరం గ్రామంలో హనుమంతుడి విగ్రహానికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల బీజేపీ ఉపాధ్యక్షుడు గొండ్ల కృష్ణాగౌడ్, నాయకులు రంగారెడ్డి, భుజంగరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవుని ఎర్రవల్లిలో ఘనంగా బోనాలు

చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లిలో ఆదివారం మైసమ్మ, ఎల్లమ్మలకు బోనాల పండుగలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలతో గ్రామం మార్మోగింది. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలుతున్న గ్రామస్తులు

సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే సబిత


లబ్ధిదారుడికి ఎల్వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నేదునూరుకు చెందిన అరవింద్ చారి చేతికి ఆపరేషన్ కోసం మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆదివారం అందజేశారు. మీర్‌పేటలోని క్యాంప్ కార్యాలయంలో గ్రామ మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డితో కలిసి అరవింద్ తండ్రి వెంకటాచారికి లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం మంజూరు చేస్తున్న సీఎం సహాయ నిధిని ప్రజలు సద్వినియోగం చేసుకొని స్వస్థత పొందాలని కోరారు.

బీజేపీతోనే సుస్థిర పాలన


ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న రాంపాల్, శ్రీకాంత్‌సింగ్

ఆమనగల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే సుస్థిర పాలన, దేశాభివృద్ధి సాధ్యమని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్, బీజేవైఎం పార్లమెంట్ కో-కన్వీనర్ రవి రాథోడ్ అన్నారు. బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పిలుపు నిచ్చా రు. నుచ్చుగుట్ట తండా, సాకిబండ తండాల్లో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీ ఎన్నికలు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల్లో పోటీ అంశాలపై చర్చించారు. 197వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా బాలునాయక్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు నంగిర్య, పత్యానాయక్, హన్మంతు, నరేందర్‌రాథోడ్, శ్రీనివాస్, శివరామ్, లాలూ, కుమార్, వినోద్, గోపి, పాండు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యకారక పరిశ్రమలను తరలించాలి



బొంగ్లూరులో రైస్ మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

ఆదిబట్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్, ఎంపీ పటేల్‌గూడ, మంగళపల్లి పరిధిలో కాలుష్యం, విష వాయువులు వెదజల్లే పరిశ్రమలను ఇక్కడి నుంచి తరలించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఆదివారం కాలుష్య వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో విజయలక్ష్మి, రాఘవేంద్ర, మై హోమ్స్ సీఎంఆర్ రిచ్ మిడోస్, అంతఃపురం, సప్తగిరి, గంగానగర్ కాలనీవాసులు ఎంపీ పటేల్‌గూడ రోడ్డు నుంచి బొంగ్లూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి సాగర్ రహదారిపై నిరసన తెలిపారు. 'కాలుష్యం వద్దు.. ఆరోగ్యమే ముద్దు.' అని నినాదాలు చేస్తూ విష వాయువులు వెదజల్లే పరిశ్రలను తరలించాలని డిమాండ్ చేశారు. జనావాసాల మధ్య ఉన్న ఫ్యాక్టరీల యాజమాన్యాలు ప్రమాదకర రసాయనాలను భూమిలోకి పంపి నీటిని కలుషితం చేస్తున్నాయని, గాల్లోకి విష వాయువులను వదులుతూ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నారని వాపోయారు. రేయింబవళ్లు వీటిని భరించలేకపోతున్నామని అన్నారు. ఇక్కడి పరిసరాల్లో ఇరవైకిపైగా రైస్ మిల్లులు, ప్లై వుడ్ తయారీ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. విపరీత కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా అధికార యంత్రాంగం నివారణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఈ పరిశ్రమలను ఇక్కడి నుంచి తరలించాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీనివాస్‌యాదవ్‌కు పరామర్శ

తలకొండపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్‌ను ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి.. రిటైర్డ్ హెచ్ఎం జంగయ్యయాదవ్ ఇటీవల మృతిచెందారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీపీ కోటయ్యయాదవ్, ఎండబెట్ల మాజీ ఎంపీటీసీ అర్జునయ్యయాదవ్ వెల్జాలలో శ్రీనివాస్‌ను పరామర్శించారు. జంగయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శలో శ్రీనివాస్‌యాదవ్, యాదయ్య, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


జంగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప పడిపూజలో గంప వెంకటేశ్, దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండ్రిగానిబోడు తండాలో ఆదివారం అయ్యప్ప పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్ ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. కేరళకు చెందిన చందర్‌నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు చేశారు. అనంతరం ఇరుముడితో శబరిమల బయల్దేరిన మాలధారులను వెంకటేశ్, దశరథ్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సేవ్యానాయక్, పాండు, బిచ్యా, భీమ్లా, సత్యం, భక్తులు పాల్గొన్నారు.

నేడు కడ్తాల్‌లో ఎమ్మెల్యే పర్యటన

కడ్తాల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం కడ్తాల మండలంలో పర్యటిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్‌రాజ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. నేటి ఉదయం 10గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో 31 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని, 11 గంటలకు నాగిరెడ్డిగూడ తండా నుంచి మక్తమాదారం వరకు రూ.1.20 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బిచ్యా, బాల్‌రాజ్‌లు కోరారు.

వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):దేవునిపడకల్ గ్రామానికి చెందిన పులిజాల మనీష అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆదివారం మనీషను ఆస్పత్రిలో మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.5వేల సాయాన్ని అందజేశారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ప్రజా సేవలతోనే సమాజంలో కీర్తి


దర్గా షెడ్డును ప్రారంభిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, గ్రామస్తులు

ఆమనగల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సేవతోనే కీర్తి సిద్ధిస్తుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ పాలుపంచుకోవాలని కోరారు. బైరాపూర్‌లో ఫౌండేషన్ నిర్మించిన సైదులు దర్గా షెడ్డును ఆదివారం రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు సుంకిరెడ్డిని సత్కరించారు. అనంతరం రాఘవేందర్ మాట్లాడుతూ.. కులమతాల కంటే మానవత్వమే గొప్పదన్నారు. దాతృత్వంతో ముందుకు సాగేవారికి దైవానుగ్రహం ఉంటుందని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువకులు పోటీపడాలని రాఘవేందర్‌రెడ్డి కోరారు. 'టాస్క్' ద్వారా యువతకు శిక్షణిచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్ర భుత్వం సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సైదులు, మీనయ్య, జంగమ్మ, సర్వేశ్, నాగేశ్, రామచంద్రయ్య, చెన్నయ్య, వెంకటేశ్, జంగయ్య, జగన్, సత్యనారాయణ, పాండు, ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చేవెళ్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఆలూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఆలూర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఉన్న ఓ ఫామ్‌హౌస్‌లో సమ్మేళనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు, టీచర్లు చంద్రశేఖర్‌రెడ్డి, రత్నమాల, కృష్ణాగౌడ్, మల్లేష్, మోహన్‌రావు, సయ్యద్ సలీం, పీఈటీ కిష్టయ్యలను పూర్వ విద్యార్థులు సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్ రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, మల్లేష్, హరి, నందు, ప్రవీణ్, నవీన్‌గౌడ్, రాధ, సౌజన్య, రాధిక, మహేందర్, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చేవెళ్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): త్వరలో రానున్న క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఆదివారం చేవెళ్లలోని రంగారెడ్డి కాలనీలో గల కర్మేల్ చర్చ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. వేడుకకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీం భరత్, సీఐ భూపాల్ శ్రీధర్, మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు హాజరై క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, సురేశ్, శ్రీనివాస్, సుశాంత్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.


సెమీ క్రిస్మస్ వేడుకలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీపీఎం ఏరియా కమిటీ కన్వీనర్‌గా శివశంకర్



ఆమనగల్లు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి ఏరియా కమిటీ నూతన కన్వీనర్‌గా పిప్పళ్ల శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమనగల్లులో ఆదివారం నిర్వహించిన పార్టీ మహాసభల్లో నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. కన్వీనర్‌గా శివశంకర్, సభ్యులుగా పెంటయ్య, కురుమయ్య, చెన్నయ్య, నర్సింహ, పోచయ్య, రమేశ్, హంసమ్మలు ఎన్నికయ్యారు. పార్టీ పటిష్టానికి కృషిచేస్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు.

రోడ్డుపైనే సంత.. అడుగడుగునా అవస్థ

(5వ పేజీ తరువాయి)


నెహ్రూ మార్కెట్‌లో ఖాళీగా ఉన్న షెడ్లు

ఎలాంటి ఇబ్బందులుండేవి కాదు. ఆ మార్కెట్లో లక్షల రూపాయలను వెచ్చించి కూరగాయల షెడ్లను సైతం నిర్మించారు. కానీ అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అయితే ఎక్కువగా గ్రామాల నుంచి వచ్చే రైతులు రోడ్లపై కూరగాయల విక్రయాలు జరుపుతున్నారు. వీరిని చూసి నెహ్రూ మార్కెట్‌లో కూరగాయలు అమ్మే వ్యాపారులు కూడా రోడ్డెక్కారు. దీంతో శంకర్‌పల్లిలోని ప్రధాన రోడ్లపై కాలు కదపలేకుండా ఉంది. సమస్య తీవ్రత తెలిసి కూడా శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్, అధికారులు, పాలకులు పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నెహ్రూ మార్కెట్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని వినియోగ ంలోకి తెచ్చి సమస్యను పరిష్కరించాల ని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ను వివరణ కోరగా.. పాలకవర్గ సభ్యుల తో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి

నెహ్రూ మార్కెట్‌లో సగం స్థలం ఖాళీగానే ఉంది. సంత నిర్వహణకు దానిని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పోలీసులు పట్టించుకోకే రోడ్లపై విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ రోడ్డుపై అర్జెంట్‌గా ఆస్పత్రులకు వెళ్లాలంటే కష్టమే. ఇతర దుకాణాలకు వెళ్లాలంటే కూడా ఇబ్బంది తప్పడం లేదు.

- వీర్ల సురేష్, శంకర్‌పల్లి

లక్ష్యం కోసం.. నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

కూడా అందించడం లేదు. ఇదే పరిస్థితి జిల్లా వ్యాప్తంగా కనిపిస్తోంది. జిల్లేడు గ్రామంలో నాటిన మొక్కలు ఎండి పోయాయి. రోజూ అధికారులు ప్రయాణించే దారిలో మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదు. మొక్కల పెంపకానికి ప్రభుత్వం చేస్తున్న ఖర్చు వ్యర్థమవుతోంది. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో విధిగా మొక్కలకు నీరు పడుతున్నట్లు అధికారులు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ప్రతీ మొక్కను సంరక్షించాలి



రోడ్ల పక్కన నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాటిన మొక్కలను గాలికి వదిలేస్తే ఎలా? వాటికి ట్రీ గార్డులు, ముళ్లకంచె ఏర్పాటు చేయక పశువులు మేస్తున్నాయి. రెండుమూడు రోజులకో సారైనా నీరుపోయక మొక్కలు ఎండి పోతున్నాయి.

- వడ్డెగారి బాల్‌రాజ్, లచ్చంపేట, చౌదరిగూడ మండలం